# నగరంలో ఎమ్మెల్యే ఆర్కే విస్తృత పర్యటన

పలు అభివృద్ధి పనుల పరిశీలన

**మంగళగిరి:** ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) శుక్రవారం నగరంలో విస్తృతంగా పర్యటించారు. తొలుత కాజ పంప్ హౌస్‌ను అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాజ రక్షిత మంచినీటి పథకం శిథిలావస్థకు చేరుకోవడంతో సుమారు రూ.10 లక్షలతో మరమ్మతులు చేపట్టడం జరిగిందన్నారు. సురక్షితమైన తాగునీటిని సరఫరా చేయాలనే సదుద్దేశంతో పంప్‌హౌస్ వద్ద నూతన ప్రెజర్ శాండ్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలు తాగునీటిని వృథా చేయకుండా కుళాయిలకు ట్యాపులు బిగించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం నగరంలోని తెనాలిరోడ్డు పంప్ హౌస్ వద్ద జరుగుతున్న స్కేటింగ్ రింక్ నిర్మాణ పనులను, స్విమ్మింగ్‌పూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. స్కేటింగ్ వీక్షించే వీక్షకులకు షెడ్లను నిర్మించడంతో పాటు కూర్చునేందుకు స్టీలు బెంచీలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పెద్దలు, చిన్నారులకు రెండు స్విమ్మింగ్ పూల్ నిర్మాణాలను పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే ఇండోర్ స్విమ్మింగ్‌పూల్‌గా ఏర్పాటు చేయడానికి షెడ్డు నిర్మాణ పనులను కాంట్రాక్టర్‌తో ప్రారంభింపజేశారు. ఫిబ్రవరి నెల చివరి నాటికి స్విమ్మింగ్‌పూల్ నిర్మాణ పనులను పూర్తి చేస్తామని అధికారులు ఎమ్మెల్యే ఆర్కేకు తెలిపారు. అనంతరం నగర పరిధిలోని పెదవడ్లపూడిలోని రక్షిత మంచినీటి పథకం వద్ద నూతనంగా నిర్మిస్తున్న రా వాటర్, ఫిల్టర్ వాటర్ పంప్‌హౌస్‌లను ఎమ్మెల్యే ఆర్కే పరిశీలించారు. పెదవడ్లపూడికి పూర్తిస్థాయిలో తాగునీటిని సరఫరా చేసేందుకు మంగళగిరి పంప్ హౌస్ వద్ద సుమారు రూ.35 లక్షలతో ప్రెజర్ శాండ్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నవులూరు గోలివారితోట వద్ద గల గాంధీ విగ్రహం జంక్షన్ వద్ద చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఆర్కే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ విగ్రహం వద్ద జంక్షన్‌ను అభివృద్ధి చేసి నవులూరు రోడ్డుకు బాబూ జగ్జీవన్‌రామ్ పేరుతో ముఖ ద్వారం ఏర్పాటు చేయాలని, కారుమంచి వెంకట సుబ్బయ్య గారి ఇంటి వరకు వెళ్లే రోడ్డుకు ఆయన పేరుతో ముఖ ద్వారాన్ని ఏర్పాటు చేయాలని నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు.



కాజలో ప్రెజర్ శాండ్ ఫిల్టర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

## క్లుప్తంగా

### రోడ్డు నిర్మాణ పనులు పునఃప్రారంభం



సాక్షి ఎఫెక్ట్

**ఫిరంగిపురం:** గతవారం సాక్షి దినపత్రికలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, వాహనదారులకు కష్టం అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. గుంటూరు–నరసరావుపేట ఆర్ అండ్‌బీ రహదారి నుంచి వేమవరం, 113తాళ్లూరు మీదుగా మేడికొండూరు వరకు తారురోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయి వాహనదారులు ఇబ్బందిపడుతున్నారనే విషయం కథనంగా ప్రచురితం కావడంతో అధికారులు, కాంట్రాక్టర్ స్పందించారు. రెండు రోజులుగా డస్టు పోసి రోలర్‌తో రోడ్డును చదును చేయిస్తున్నారు. దీంతో ప్రయాణానికి అనుకూలంగా ఉందని వాహనదారులు చెబుతున్నారు.

### వానపాములతో భూమి సారవంతం



**ఫిరంగిపురం:** వానపాములతో భూమి సారవంతంగా మారుతుందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల బృంద సభ్యురాలు చాందినీ అన్నారు. వేములూరిపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో పండిస్తున్న పత్తి పంటను శుక్రవారం లాంఫాం శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా చాందినీ మాట్లాడుతూ పత్తి మొక్క వేరు భాగం వద్ద పది వరకు వానపాములు ఉండటంతో భూమి సారవంతంగా మారిందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంతో అది సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో డేటా అనలిస్ట్, ఎస్‌డీఏ అన్నామణి, వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

### వేణుగోపాలుడికి విశేష పూజలు



**ఫిరంగిపురం:** 113తాళ్లూరు గ్రామంలో రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో పుష్యమాస బహుళత్రయోదశిని పురస్కరించుకొని శుక్రవారం అర్చకులు ప్రసన్నమూర్తి, కృష్ణమూర్తి విశేషపూజలు నిర్వహించారు. ఉదయాన్నే కలశాలతో ఊరేగింపు నిర్వహించి స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకాలు చేసి, అష్టోత్తర, సహస్రనామ పూజలు జరిపారు. మండపారాధన, పుణ్యాహవచనం, గణపతి హోమాలను వేదపండితులు డి.గోపాలాచార్యులు, డి.పవన్‌కుమార్, నారాయణం గోవర్ధనరఘురామ్, ఎస్.రాజభట్టాచార్యులు, శ్రీనివాసచార్యులు, కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో శ్రీసూక్తం, విష్ణుసహస్రనామ పారాయణం గావించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

### ఫిజియోథెరపీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఆయుష్ మెడికల్ అధికారి డాక్టర్ రామానంద్



**మంగళగిరి:** నగర పరిధిలోని పెదవడ్లపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న ప్రభుత్వ యోగ, ప్రకృతి వైద్యశాల విభాగంలో ఫిజియోథెరపీ సేవలు అందించడం జరుగుతోందని ఆయుష్ మెడికల్ అధికారి డాక్టర్ రామానంద్ తెలిపారు. శుక్రవారం పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైద్యశాలలో ఎక్విప్‌మెంట్స్ ట్రాక్షన్, అల్ట్రా సౌండ్ థెరపీ, మజిల్స్ స్టిములేటర్, ఐఎఫ్‌టీ వంటి అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పక్షవాతం, భుజం నొప్పి, మెడనొప్పి, కాళ్ల నొప్పులు, వెన్ను నొప్పి, మోకాళ్ల నొప్పులు, డైట్ కౌన్సెలింగ్ సేవలతో పాటు ఎముకలకు సంబంధించిన ఆపరేషన్ కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. వైద్యశాలలో ప్రతి రోజూ 20 నుంచి 30 మంది రోగులు వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రకృతి వైద్యశాల పనిచేస్తుందని వివరించారు. ఆరోగ్య కేంద్రం పరిసర ప్రాంతాల ప్రజలు ప్రకృతి వైద్య సేవలను వినియోగించుకోవాలని డాక్టర్ రామానంద్ కోరారు.

## పాత జాతీయ రహదారి వెంబడి జంగిల్ క్లియరెన్స్

**తాడేపల్లిరూరల్:** మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పాత జాతీయ రహదారి వెంబడి శుక్రవారం కార్పొరేషన్ అధికారులు జంగిల్ క్లియరెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారి వెంబడి సాయిబాబా గుడి దగ్గర నుంచి ముగ్గు రోడ్డు చర్చి వరకు రోడ్డుకు ఇరువైపులా పిచ్చిచెట్లు పెరిగిపోవడంతో పాటు చెత్తాచెదారం పేరుకుపోయింది. సచివాలయ సిబ్బంది ఫిర్యాదు మేరకు కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి వెంటనే ఆ ప్రాంతాన్ని పరిశుభ్రం చేయాలని ఆదేశించడంతో శానిటేషన్ సిబ్బంది కార్పొరేషన్ పొక్లెయిన్‌తో శుభ్రపరిచారు. రోడ్డు వెంబడి ఎవరైనా చెత్తాచెదారం పడవేస్తే వెంటనే కార్పొరేషన్ వారికి సమాచారం ఇవ్వాలని, ఎక్కడి నుంచో చెత్త తీసుకువచ్చి పడవేస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ హనుమంతరావు తెలిపారు.



ముగ్గురోడ్డు వద్ద జంగిల్ క్లియరెన్స్ చేస్తున్న కార్పొరేషన్ వాహనం

### పోలీసుల అదుపులో హుండీ దొంగలు?

**తాడేపల్లిరూరల్:** పెనుమాకలో పలు దేవాయాల్లో హుండీలు పగులకొట్టిన కేసులో అనుమానిస్తూ ఇద్దరు యువకులను తాడేపల్లి పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ నెల 16వ తేదీ పెనుమాకలోని రామాలయం, బ్రహ్మంగారి గుడిలో ఇద్దరు యువకులు హుండీ పగలకొట్టి, అందులోని నగదును దొంగిలించారు. పెనుమాకలోని వివిధ ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఆధారంగా కృష్ణాయపాలేనికి చెందిన ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పోలీసుల అదుపులో ఉన్న ఆ అనుమానిత యువకులు గతంలో తుళ్లూరు మండలం మందడం సాయిబాబా గుడి, మంగళగిరి రూరల్ కృష్ణాయపాలెంలోని శివాలయంలో హుండీల చోరీకి పాల్పడిన పాత నేరస్తులే కావడం గమనార్హం.

## పగటికలలు కంటున్న అయ్యన్న పాత్రుడు

సీఎంపై అయ్యన్నపాత్రుడి అనుచిత వ్యాఖ్యలను ఖండించిన కత్తెర సురేష్ కుమార్



**తాడికొండ:** 8 నెలల్లో టీడీపీ అధికారంలోకి వస్తుందని, తాను హోమ్ మినిస్టర్ అంటూ పగటికలలుకంటున్న టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు అయ్యన్న పాత్రుడు చివరకు ఈసారి ఎమ్మెల్యేగా అయినా గెలుస్తాడా? అని తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ ఎద్దేవా చేశారు. శుక్రవారం గుంటూరులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మోతడకలో సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అయ్యన్న పాత్రుడి వ్యవహార శైలిని తీవ్రంగా ఖండించారు. మాజీ మంత్రిగా పనిచేసి, సీనియర్ నాయకుడిగా ఉన్న అయ్యన్న పాత్రుడు మాట్లాడే మాటలు సమాజానికి తప్పుడు సంకేతాలు ఇస్తున్నట్లు ఉన్నాయని పేర్కొన్నారు. బూతుల పంచాంగంతో సభ్య సమాజం తలదించుకునేలా ఆయన సీఎం, మంత్రులు, పోలీసు వ్యవస్థపై చేస్తున్న వ్యాఖ్యలు ఎంతవరకు సమంజసమో ఓ సారి ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. అయ్యన్న పాత్రుడు బహిరంగ క్షమాపణ చెప్పకపోతే ప్రజలు ఆయనకు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఇంకా 16 నెలలు ప్రభుత్వానికి అధికారం ఉంటే 8 నెలల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తుందని, తాను హోమ్ మినిస్టర్ అవుతానంటూ పోలీసులను దుర్భాషలాడిన అయ్యన్న పాత్రుడిపై తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. టీడీపీ అధికారంలోకి రావడమనేది కలలో కూడా జరగదని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కుల, మతాలు, పార్టీలకు అతీతంగా అందించిన సంక్షేమ పాలనతో 175కు 175 సీట్లు సాధించడం ఖాయమన్నారు. గ్రామాల్లోకి నేడు ఎమ్మెల్యేలు వెళుతుంటే ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, టీడీపీ అధికారంలోకి రావడం అనేది పగటి కలగానే మిగిలిపోతుందన్నారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు ప్రజలను అసత్యాలతో మోసగించాలనుకోవడం మానుకోవాలని హితవుపలికారు.

### ఈమని ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసిన డీఈఓ



మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ

**తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల):** దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని ప్రభుత్వ పాఠశాలను గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రిజిస్టర్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం నాడు నేడు పాఠశాల పనులను పరిశీలించి సూచనలు చేశారు. జగనన్న విద్యాకానుక కిట్లను పరిశీలించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులను విద్యాసామర్థ్యాలపై ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. 8వ తరగతి విద్యార్థులకు జగనన్న ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను ఏ విధంగా ఉపయోగించుకోవాలో సూచించారు. రాష్ట్ర స్థాయిలో క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించిన పి.ప్రియ, కె.రోహిణిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఏడుకొండలు, ఉపాధ్యాయులు నాగవేణి, సీతామహాలక్ష్మి, ఫణిబాలకృష్ణ, శ్రీనివాసరావు, బ్రహ్మేశ్వరరావు, టి.వాసు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## 25న నూతన తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం

తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్

**మంగళగిరి:** నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని ఈ నెల 25వ తేదీ ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన నగర పరిధిలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని పంచాయతీరాజ్ డీఈ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్న నూతన తహసీల్దార్ కార్యాలయ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ బ్రిటీష్ కాలంలో నిర్మించిన పాత తహసీల్దార్ భవనం శిథిలావస్థకు చేరుకుందని, ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) చొరవతో జిల్లా ఉన్నతాధికారులు నగరంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోగల పంచాయతీరాజ్ డీఈ కార్యాలయాన్ని తహసీల్దార్ కార్యాలయంగా వినియోగించుకునేందుకు అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ క్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి నూతన భవనంలో వివిధ చాంబర్లను కేటాయించేందుకు వీలుగా చిన్నచిన్న మరమ్మతులతో పాటు పెయింటింగ్, ఎలక్ట్రికల్ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ నెల 25వ తేదీ నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించి ప్రజలకు ఇక్కడి నుంచే సేవలు అందించడం జరుగుతుందన్నారు.



నూతన తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్

### నేడు పునీత ఆగ్నేసమ్మ ఆలయ 119వ వార్షికోత్సవం

**మేడికొండూరు:** పేరేచర్ల గ్రామంలో శనివారం పునీత ఆగ్నేసమ్మ ఆలయ 119వ వార్షికోత్సం జరగనుంది. ఈ సందర్భంగా పేరేచర్లలో తిరునాళ్ల సందడి నెలకొంది. ప్రతి ఏడాదికి ఈ పండుగను గ్రామస్తులు అత్యంత ఘనంగా జరుపుతారు. ఇప్పటికే పేరేచర్ల జంక్షన్, గ్రామంలోని దేవాలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం ప్రత్యేక దివ్యపూజాబలి జరుగుతుందని పేరేచర్ల విచారణ గురువు నుదురుపాటి చంద్రమోహన్ తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు మేత్రాసనం పీఠాధిపతులు చిన్నాబత్తిని భాగ్యయ్య పాల్గొంటారని తెలిపారు. రాత్రికి కొవ్వొత్తుల సమర్పణ, గ్రామ వీధుల్లో తేరుప్రదక్షిణ, భక్తి గీతాల ఆలపనతో ప్రత్యేక ఊరేగింపు జరుగుతుందన్నారు. పండుగ నిర్వహణకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

### ఉర్దూ పాఠశాల ప్రారంభం

**మంగళగిరి:** నగరంలోని పాత బస్టాండ్ సెంటర్‌లోగల అంజుమన్ – యి – హిమాయితుల్ ఇస్లాం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఉర్దూ స్కూల్, సమావేశ మందిరాలను శుక్రవారం ముస్లిం ఫ్రంట్ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ రఫీ, ముస్లిం యువతరం అధ్యక్షుడు ఎండీ ఇక్బాల్ అహ్మద్, అంజుమన్ ట్రస్టు బోర్డు అధ్యక్షుడు పఠాన్ అష్రఫ్‌ఖాన్ ప్రారంభించారు. కార్యక్రమంలో అంజుమన్ ట్రస్టు బోర్డు కార్యదర్శి షేక్ అస్గర్ అలీ, సభ్యులు ఆరిఫుల్లా, తస్లీం బాషా, నాసిర్, మాబుసుభాని, జిలానీ, మెయినుద్దీన్ ఖాన్, షౌకత్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## యర్రబాలెంలో అసైన్డ్ భూముల సర్వే

**మంగళగిరి:** నగర పరిధిలోని యర్రబాలెం సర్వే నంబరు 774లోగల అసైన్డ్ భూముల్లో రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. ఇటీవల యర్రబాలెం అసైన్డ్ బాధితులు పలువురు నియోజకవర్గ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)ని కలిసి 1954కు ముందు రిజిస్ట్రేషన్లు అయిన అసైన్డు భూముల్లో నివశిస్తున్న తమకు భూ హక్కులు కల్పించాలని వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించిన ఆయన అసైన్డు భూములను సర్వే చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ జీవీ రామ్ ప్రసాద్‌కు సూచించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ సాంబశివరావు, సర్వేయర్ సునంద, వీఆర్‌ఓ ఆయూబ్ యర్రబాలెం సర్వే నంబరు 774లో గల అసైన్డు భూముల్లో సర్వే చేపట్టి హద్దులను గుర్తించారు. అసైన్డు భూములపై పూర్తి వివరాలతో వీలైనంత త్వరితగతిన నివేదిక తయారు చేసి తహసీల్దార్‌కు అందజేయనున్నట్లు ఆర్ఐ సాంబశివరావు తెలిపారు.



యర్రబాలెంలోని అసైన్డ్ భూములను పరిశీలిస్తున్న ఆర్ఐ సాంబశివరావు, సర్వేయర్ సునంద

### 16 టిప్పర్ల పట్టివేత

**మంగళగిరి:** అక్రమంగా మట్టి తరలిస్తున్న 16 టిప్పర్లను పట్టణ పోలీసులు పట్టుకున్నారు. పట్టణ పోలీసుల కథనం మేరకు.. నగరంలోని ప్రధాన రహదారి మీదుగా టిప్పర్లలో మట్టిని తరలిస్తుండగా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. బిల్లులు లేకపోవడంతో స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్న టిప్పర్లు

### ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



పేడ, ఇంగువ ద్రావణం తయారీని చూపుతున్న అధికారులు

**మేడికొండూరు:** సిరిపురం గ్రామంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మిర్చి పంట సాగులో పలు రకాల తెగుళ్ల నివారణకు ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పేడ, ఇంగువ ద్రావణం తయారీని రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతిరావు, మేరి, వాణి, పీఆర్పీ రామకృష్ణ పాల్గొన్నారు.

### బీపీ మండల్ కాంస్య విగ్రహావిష్కరణకు తరలిరండి

డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు

**తాడేపల్లిరూరల్:** మాజీ పార్లమెంట్ సభ్యుడు, సంఘసంస్కర్త బిందేశ్వరి ప్రసాద్ మండల్ (బీపీ మండల్) కాంస్య విగ్రహావిష్కరణకు అందరూ తరలిరావాలని గుంటూరుకు చెందిన ప్రముఖ పిల్లల వైద్యుడు ఆలా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం తాడేపల్లిలోని ప్రముఖ విద్యావేత్త తాడిబోయిన నాగేశ్వరరావు నివాసంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 12వ తేదీ గుంటూరులోని అమరావతిరోడ్డు సిటీ స్క్వేర్ జంక్షన్ వద్ద జరిగే బీపీ మండల్ కాంస్య విగ్రహావిష్కరణకు అందరూ రావాలన్నారు. ఈ సమావేశంలో దానబోయిన సుందరరావు, ఢిల్లీ రామారావు, కేటీవీ ప్రసాద్, కంభం సాయిచంద్, దాసరి శివకుమార్, ఎర్రాకుల తులసీరామ్, కుమ్మా సదాశివరావు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడిగా మండ్రు

**మంగళగిరి:** బీసీ సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడిగా నగరానికి చెందిన మండ్రు సత్యనారాయణ, సంఘం మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలుగా బిట్రా ఈశ్వరి నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ శుక్రవారం నగరంలోని బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారికి నియామకపు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ పదవులు పొందిన వారు బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్నం నాగబాబు, సంఘం మహిళా విభాగం జిల్లా కో–ఆర్డినేటర్ కాగితాల స్వాతి, నాయకులు వాకా మాధవరావు, ఆలా శివాజీ, తిరువీధుల కిరణ్, కాటూరి పావని తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణకు నియామక పత్రాన్ని అందిస్తున్న బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహేష్

## అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని వినతి

**మంగళగిరి:** అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)ని శుక్రవారం నగరంలోని ఆయన కార్యాలయంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కలసి వినతిపత్రాన్ని అందజేశారు. సీఎం ఇచ్చిన హామీ మేరకు అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసేలా ఆయన దృష్టికి సమస్యను తీసుకెళ్లాలని అసోసియేషన్ నేతలు ఎమ్మెల్యే ఆర్కేను కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ నేతలు చిన్ని తిరుపతయ్య, జాలాది జాన్‌బాబు, గౌరీశంకర్, కృష్ణ, భాస్కర్, బాబు, శ్రీను, పూర్ణ తదితరులు ఎమ్మెల్యే ఆర్కేను కలసి వినతిపత్రం అందించిన వారిలో ఉన్నారు.



ఎమ్మెల్యే ఆర్కేకు వినతిపత్రం అందజేస్తున్న అగ్రిగోల్డ్ కస్టమర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు

## ఎన్నారైలో బేసిక్ హ్యాండ్ కోర్సు కాన్ఫరెన్స్

**మంగళగిరి:** నగర పరిధిలోని చినకాకాని ఎన్నారై మెడికల్ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం రెండు రోజుల పాటు నిర్వహించతలపెట్టిన ఐఎస్‌ఎస్‌హెచ్ బేసిక్ హ్యాండ్ కోర్సు కాన్ఫరెన్స్ ప్రారంభమైంది. ఈ కాన్ఫరెన్స్‌ను ఎన్నారై అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హ్యాండ్ సర్జరీ, సాంకేతికత మీద జరిగిన కాన్ఫరెన్స్‌లో సీనియర్ వైద్యులు డాక్టర్ భాస్కర్ ఆనంద్, డాక్టర్ అనిల్‌భట్ పాల్గొని వారి అనుభవాన్ని వైద్య విద్యార్థులతో పంచుకున్నారు. ఇలాంటి వర్క్‌షాప్‌ల వల్ల వైద్య విద్యార్థులకు అవగాహన వస్తుందన్నారు. ఆర్థోపెడిక్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ డాక్టర్ సత్యకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మి, సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, రియాజ్, డాక్టర్ ఆశిష్‌తో పాటు పలువురు పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.



ఎన్నారైలో కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తున్న అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధన్

## వక్ఫ్ భూమిలో అక్రమ నిర్మాణం!

**షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి అద్దెలకిచ్చిన వైనం**

- తొలగించాలని రెవెన్యూ శాఖకు ఫిర్యాదు చేసిన వక్ఫ్ అధికారులు
- విద్యుత్ కనెక్షన్ తొలగించాలని విద్యుత్ శాఖకు నోటీసులు
- అనుమతులు లేని కట్టడానికి ఇంటి పన్ను, విద్యుత్ కనెక్షన్ జారీ

**తాడికొండ:** తాడికొండలో ప్రధాన రహదారి వెంట వక్ఫ్ భూమిల్లో అక్రమంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి యథేచ్ఛగా అద్దెలకు ఇచ్చిన ఘటన చోటుచేసుకుంది. బాధితుల ఫిర్యాదుతో కదలిన వక్ఫ్ అధికారులు సదరు నిర్మాణం నిలిపేయాలని రెవెన్యూ శాఖకు ఫిర్యాదు చేసినా అధికార యంత్రాంగం చోద్యం చూస్తూ నిర్మాణానికి సహకరించడం విశేషం. మరో విశేషం ఏమిటంటే ఎవరి వాటాలు వారు అందుకొని అక్రమ నిర్మాణానికి ఇంటి పన్ను, కరెంటు కనెక్షన్ జారీ చేశారంటే ఏ స్థాయిలో వ్యవహారం నడిచిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సేకరించిన వివరాల ప్రకారం.. తాడికొండ ప్రధాన రహదారిలో 62 చదరపు గజాల పీర్ల ఇనాం భూమి ఉంది. ఈ భూమిలో గతంలో పీర్ల ఉత్సవాలు నిర్వహించేవారు. కాలగమనంలో ఉత్సవాలు నిలిపేయడంతో సదరు భూమి ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో ఈ భూమిపై కన్నేసిన పలువురు వ్యక్తులు గతంలో తమదంటే తమదంటూ ఆక్రమణ చేసేందుకు యత్నించగా పలువురు ఫిర్యాదులతో నిలిచిపోయింది. ఇటీవల మంగళగిరికి చెందిన ఓ వ్యక్తి సదరు భూమి తనదని చెప్పుకుని నిర్మాణ పనులు ప్రారంభించాడు. దీనిపై షేక్ షకీరా భేగం పీర్ల ఇనాం భూమిలో ఆక్రమణ, అక్రమ నిర్మాణం జరుగుతోందని 22 నవంబర్ 2021వ తేదీ వక్ఫ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. షేక్ పర్వేజ్ అనే యువకుడు కూడా దీనిపై ఫిర్యాదు చేయడంతో కదిలిన వక్ఫ్ అధికారులు అక్రమ నిర్మాణం నిలిపి వేయాలంటూ రెవెన్యూ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణం చేస్తున్న వ్యక్తికి రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేసి నిర్మాణానికి తగిన ఆధారాలు చూపించాలని కోరినప్పటికీ స్పందించలేదు. సదరు ఆక్రమణదారుడు కాంప్లెక్స్ నిర్మాణం పూర్తిచేసేశాడు. ఈ క్రమంలో ఈ అక్రమ నిర్మాణానికి పంచాయతీ అధికారులు ఇంటి పన్ను వేసి ఎన్‌వోసీ జారీ చేయగా, విద్యుత్ అధికారులు మీటరు కనెక్షన్ ఇవ్వడంతో యథేచ్ఛగా దుకాణాలను అద్దెలకు ఇచ్చి సదరు ఆక్రమణదారుడు జేబులు నింపుకుంటున్నారు. 20 రోజుల క్రితం విద్యుత్ కనెక్షన్ కత్తిరించాలంటూ రెవెన్యూ అధికారులు విద్యుత్ శాఖాధికారులకు నోటీసులు జారీ చేయడంతో విద్యుత్ అధికారులు 15 రోజుల గడువు ఇస్తూ సదరు అక్రమ నిర్మాణదారుడికి నోటీసులిచ్చారు. కానీ నెల రోజులు కావస్తున్నా విద్యుత్ తొలగించకపోవడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి వెంట లక్షల రూపాయల విలువైన వక్ఫ్ భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణం జరుగుతుంటే చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం ఈ వ్యవహారంలో భారీగానే ముడుపులు అందుకున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి వక్ఫ్ భూముల్లో అక్రమ నిర్మాణాన్ని తొలగించి, అడ్డగోలు అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



తాడికొండలో వక్ఫ్ భూమిలో అక్రమంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్

**నోటీసులిచ్చినా తగిన ఆధారాలు చూపించలేదు**

అక్రమ నిర్మాణంపై వక్ఫ్ అధికారుల ఫిర్యాదు మేరకు తగిన ఆధారాలు చూపించాలంటూ నిర్మాణదారుడికి నోటీసులిచ్చాం. ఎలాంటి ఆధారాలు చూపించకపోవడంతో విద్యుత్ కనెక్షన్ తొలగించాలని సంబంధిత శాఖకు ఆదేశాలిచ్చాం.

– జీవీఎస్ ఫణీంద్ర బాబు, తహసీల్దార్, తాడికొండ

**15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని నోటీసుల్లో కోరాం**

తహసీల్దార్ ఆదేశాల మేరకు విద్యుత్ కనెక్షన్‌ను తొలగించేందుకు 10 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని సదరు వ్యక్తికి నోటీసులిచ్చాం, కానీ సదరు నిర్మాణదారుల నుంచి ఎలాంటి జవాబు రాలేదు. త్వరలో తగిన చర్యలు తీసుకుంటాం.

– ఎస్‌వీ రవి కుమార్, ఏఈ, విద్యుత్ శాఖ

## చికిత్స పొందుతూ వివాహిత మృతి

**తాడేపల్లిరూరల్:** కొలనుకొండ చెందిన మహిళకు ప్రమాదవశాత్తు శరీరం కాలి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఎస్ఐ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఇసుకపల్లి జాన్‌బాబు భార్య అయిన ఇసుకపల్లి సాధన అలియాస్ పండు (19) ఇంటి వద్ద బుధవారం వేడినీళ్ల బక్కెట్‌లోకి వంచుతుండగా పొయ్యిలోని నిప్పు ఆమె నైటీకి అంటుకుని కాళ్ల దగ్గర నుంచి నడుము వరకు కాలి గాయాలయ్యాయి. విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సాధన మృతి చెందింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.